
కథ

# తీయని ఫలం

– వాలి హిరణ్మయాదేవి




"అబ్బా! పంటికింద మళ్లీ రాయొచ్చింది. కళ్లు సరిగ్గా కన్పించటం లేదంటే మొన్నేగా కళ్లజోడు ఇప్పిచాను. నాల్గుకళ్లున్నా రాళ్లింకా కన్పించటం లేదా?" నవ్వుతూ అడిగాడు రామారావు.

"ఆఁ మరే! ముప్పై రెండు పళ్లున్నప్పటికీ మీరు నమల్లేకపోతున్నట్లే" వెంటనే రిటార్ట్ ఇచ్చింది జానకి.

ఆమాటలకు కిసుక్కున నవ్వాడు నవీన్. అతన్నే చూస్తూ నవ్వింది నిరుపమ.

"మీ అమ్మానాన్నల పోట్లాటలు, మాటలు నాకు భలే ఇష్టం" అంటుంటాడు అతను. పెళ్లై రెండేళ్లయినా ఇంచుమించు నెలకోసారైనా వస్తుంటాడు నిరుపమని తీసుకుని. పుట్టింటికి రావడమంటే ఎవరికిష్టం ఉండదు గనుక అందుకే నిరుపమ అతడు పద అంటే ఈమె ఛలో అంటూ అతని స్కూటర్ ఎక్కుతుంది.

"అత్తామామలంటే ఇంత ఇష్టపడే అల్లుడ్ని మిమ్మల్నే చూస్తున్నాను" అంటుంది మురిపెంగా నిరుపమ.

కుటుంబ వాతావరణానికి దూరంగా హాస్టల్లోనే ఉండి చదువుకుంటూ ఆ ఆప్యాయతలని చవిచూడని నవీన్‌కి తన భార్యా నిరుపమ కుటుంబం అంటే చాలా ఇష్టం ఏర్పడింది. తనని అల్లుడిలా కాక కొడుకులా వారు ఆదరించడం అన్నీ తనని సంప్రదించి చేస్తుండటం గూడా అతనికి ఎంతో నచ్చింది.

"నవ్వుతున్నావా నాయనా! నవ్వు నా బతుకిలా నవ్వులపాలైంది మరి " అన్నాడు రామారావ్.

"మమ్మల్ని నవ్విస్తూ మీ ఆరోగ్యాలని మీరు మరింత మెరుగుపరుస్తున్నారని నేను అనుకొంటూ ఉన్నానే" అన్నాడు నవీన్.

"ఓహ్ ఆ రూల్‌లోకి వచ్చావా? సరే అయితే నవ్వు." అన్నాడతను.

"మాకేం ఒక్కరాయీ కూడా రాలేదు మరి" అంది అనుపమ.

"నాకూనూ" అంది నిరుపమ.

"నాకు గూడా మీకే ఎలా వచ్చిందో?"

"బహుశా అమ్మ ప్రేమలో అన్నీ దాచి నాన్నకి పెట్టినట్లే ఇదీ పెట్టి ఉంటుంది" అంది అనుపమ సీరియస్‌గా.

దాంతో అందరూ మళ్లీ కిలకిలా నవ్వారు. ఉడుక్కొంటూ లేచి వెళ్లాడు రామారావ్.

మరోగంటకల్లా వేడివేడి పకోడీలను చేసి పట్టుకొచ్చింది జానకి.

"భోంచేసి గంట కూడా కాలేదు. మళ్లీ టిఫినా" అన్నాడు నవీన్.

"అల్లుడిగారికి స్పెషల్ అని మురుస్తున్నారేమో. నాన్న ఇందాక అలిగి లేచాడు కదా సరిగ్గా తిని ఉండకపోవచ్చని చేసి ఉంటుంది అమ్మ. అవునా అమ్మా!" అంది నిరుపమ.

"చాల్లే ఊరుకో" అంది ముసిముసిగా నవ్వుతూ జానకి.

"మనమంతా కలిసి బైటకి వెళ్లి చాలా కాలమైంది. అలా ఏ నాగార్జునసాగర్‌కో పిక్నిక్ ప్రోగ్రాం వేద్దాం బావుంటుంది"

"దానికైతే కనీసం ఓ రోజు లీవ్ పెట్టాలి. ఇవాళ్లంతా కలిసి బిర్లామందిర్ వెడదాం" ప్రపోజ్ చేశాడు నవీన్.

ఇక దాంతో అందరూ చకచకా తయారయ్యారు.

దర్శనం అయ్యాక ఆ గుడిప్రాంగణంలో కూర్చున్నారంతా. హుస్సేన్‌సాగర్ మీద నుంచి వచ్చే చల్లటిగాలి వారిని సేద దీర్చసాగింది.

ఇంతలో దూరం నుండి ఓ స్త్రీ వడివడిగా వస్తూ "ఏయ్ జానీ! నువ్వేగా అబ్బా! ఎంతకాలానికి కలిశామే. బాగున్నావా?" అంది. ఆమెని చూడగానే జానకి మొహం వికసించింది.

"ఆఁ... నువ్వా ఆరతీ! ఎన్నాళ్లకి చూశానే. అబ్బా ఎన్నేళ్లయింది. ఎలా ఉన్నావ్? ఏరీ! మీ వారు, పిల్లలూ" చుట్టూ చూస్తూ అడిగింది జానకి.

"నేనొక్కదానినే వచ్చాలే! ఆ అన్నయ్యా బావున్నరా? ఏంటి మన చిన్ని మున్నిలింత పెద్దయ్యారా? ఈ అబ్బాయి..." నవీన్‌ని ప్రశ్నార్థకంగా చూస్తూ అడిగింది.

"ఈ అబ్బాయ్ మన చిన్ని ఉరఫ్ నిరుపమ భర్త. అంటే మా అల్లుడు" నవ్వుతూ చెప్పింది జానకి.

"నమస్తే ఆంటీ" విష్ చేశాడు నవీన్.

"ఆంటీ ఏమిటి? నేను దీనికన్నా పెద్దదాన్ని. ఎంచక్కా పెద్దమ్మా అని పిలువు." అంది ఆరతి చనువుగా. తెల్లబోతూనే సరేనన్నాడు నవీన్.

"ఆ... ఇప్పుడు చెప్పవే... చిన్నదేం చేస్తోంది" అంది అనుపమని చూస్తూ.

"ఇదిప్పుడు బ్యాంక్‌లో జాబ్ చేస్తోంది" అంది తృప్తిగా జానకి.

"వెరీగుడ్ మూడోసారి కూడా ప్రెగ్నెంటయ్యావ్‌గా ఆ మెంబర్ ఏడి" అంది ఆరతి.

ఆ మాటలకు రామారావ్, జానకిల ముఖాలు ఒక్కసారిగా చిన్నబోయాయి. జానకి కళ్లు కన్నీళ్లతో నిండిపోయాయి.

రామారావే గొంతు పెగుల్చుకుని "నా మూర్ఖత్వం వల్ల జానకికి గర్భస్రావం అయింది. గర్భంలో ఉన్నది ఆమెంతో కోరుకుంటున్న 'బాబు' అని తెలిసేసరికి మరింత తల్లడిల్లిపోయింది. మరణం అంచుల వరకు వెళ్లి కేవలం నా అదృష్టం పిల్లల అదృష్టం కొద్దీ బతికింది" అన్నాడు.

"అరెరె! వెరీసారీ! జానీ మానుతున్న గాయాన్ని మళ్లీ..."

"ఛ... ఊరకోవే. ఏంటో ఆ సంఘటన గుర్తొస్తే ఇప్పటికీ నన్ను నేను కంట్రోల్ చేసుకోలేకుండా అవుతాను" అంది జానకి. ఆమె మాటలకు అడ్డు వచ్చి. "ఇంతకీ నీ సంగతేంటి? నువ్వు విడాకులు..." అంటూ నాలుక్కరుచుకుని ఆ టాపిక్ వదిలెయ్యబోయింది జానకి.

"ఫర్వాలేదే... నాకథ ఎంతమందికి తెలిస్తే అంత మంచిదనే అనుకొంటాను. ఎవరన్నా మంచి నిర్మాత దొరికితే నేను రాసుకున్న నాకథను సినిమాగా తీయమందును. ఎందరో ఎడ్యుకేట్ అయ్యేవారు" అంది ఆవేశంగా ఆరతి.

"పోనీలేవే! ఇప్పుడేం చేస్తున్నావ్" అంది జానకి.

"పద, అక్కడ కూర్చొని చెబుతాను. నీ పిల్లలూ పెద్దవాళ్లయ్యారుగా విన్నా ఏం ఫర్వాలేదు" అంది ఆరతి,

రామారావ్ జానకిలు మొహాలు చూసుకున్నారు. నవీన్ కొంచెం ఇబ్బందిగా ఫీలై " నేనలా తిరిగివస్తా ఆం... పెద్దమ్మా" అన్నాడు.

"ఆహాఁ... నువ్వే వినాలి... ఐ మీన్ ముఖ్యంగా మగాళ్లంతా విని ఆడదాని మనసుని అర్థం చేసుకోవాలి. కాబట్టి నువ్వా అన్నయ్యతో పాటు కూర్చొని వినాల్సిందే" అంది ఆరతి అతని చేయిని పట్టుకుని ఆపేస్తూ.

"ఇక తప్పదు కూర్చోండి" చిరునవ్వుతో అంది నిరుపమ.

"జానీ నీకు తెలుసుగా నాకు చిన్నప్పట్నుండీ బొమ్మలు వేయటం అంటే ప్రాణమని. మానాన్న నాకు అన్నీ కొని తెస్తుంటే అమ్మెప్పుడూ నన్ను తిట్టేది "ఇవేం కూటికీ గుడ్డకీ పనికొచ్చేనా? ఆడపిల్లన్నాక పనీపాటలూ నేర్చుకోవాలని. నాకింటిని శ్రద్ధగా తీర్చి దిద్దడం అందరి ప్రశంసలు అందుకోవటం ఎంత సరదాగ ఉండేది. మేం స్వంతిల్లు కట్టుకొన్నాక అన్ని సర్దాలనుకొంటే అమ్మే 'కొత్తకోడలు సర్దితే బావుంటుందంటూ' మా వదినికా పని చెప్పింది. ఇక అత్తవారింట్లో చేయబోతే మా అత్తా ఆడబిడ్డా పడనివ్వలేదు. మావారి ధనపిపాసకు అనుమానపు బుద్ధికి అంతే లేదు. శారీరక ధర్మంకొద్దీ ఇద్దరి బిడ్డలకు తల్లినయ్యానే తప్ప ఆయనంటే ఏనాడు ఇష్టం లేకపోయింది. తన ధనసంపాదనకు నన్నో వేశ్యలా వాడుకొందుకు ఆయన ప్రవర్తిస్తే మాత్రం ఇక భరించలేక ఆ ఇంట్లో నుండి బైటపడ్డాను. నా కష్టంతో పిల్లలను పెద్ద చేశాను. కూతురికి పెళ్లి చేశాను. కానీ రెణ్నెళ్లు తిరక్కముందే శవమై పోయింది. కొడుకు పెళ్లి చేశాను. కోడలొచ్చింది. ఆమెకు ఈ ముసలి అత్తగారు 'విడాకులు తీసుకున్న స్త్రీ' కాబట్టి నచ్చలేదు. అహోరాత్రులు కష్టపడి కట్టుకొన్న నా ఇంట్లోంచి నన్ను బైటకు వెళ్లేలా చేసింది. నాకంటూ ఓ ఇల్లు లేక, భర్తాపిల్లలూ లేక ఇంక ఎందుకీ పాడుబతుకు అనుకొంటూ హుస్సేన్‌సాగర్‌లో దూకాను. కానీ సాంత్వన సేవాసదనం వాళ్లు నన్ను బతికించారు. వాళ్ల ఆదరాభిమానాలతో మళ్లీ పునర్జీవితం దొరికింది నాకు. అందులోనే ఉంటూ నా లాంటి నిర్భాగ్యులకు చేతనైనంతగా సాయం చేస్తూ ఆ సదన్ సహాయ నిర్వాహకురాలిగా ఉంటున్నాను" అంది ఆరతి.

"ఆడదిగా పుడితే ఇన్ని కష్టాలు పడాల్సిందేనా" అనుకొన్నాడు బరువుగా రామారావ్.

వింటున్న వారందరి మనసులూ భారమయ్యాయి.

"ఓహ్ ఐయాం వెరీసారీ! సరదాగ వచ్చిన మీ అందరి మూడ్స్ పాడుచేశాను" నొచ్చుకుంటూ అంది ఆరతి.

"మీరొచ్చి పాడుచేసిందేం ఉంది.



ప్రతీరోజూ పేపర్ తీయగానే చదివేది ఇలాంటి వేదనాభరితమైన కథలేగా " అన్నాడు నవీన్.

"ఇంతకీ ఆ సాంత్వన సేవ సదనం" ఎక్కడుంది ఆంటీ!" అంది అనుపమ.

"ఇక్కడికీ చాలా దగ్గర్లోనే"

"మేం చూడొచ్చా?"

"వైనాట్? ష్యూర్. అయ్యో అసలు విషయం చెప్పడం మరిచానే. ఆ సంస్థను స్థాపించింది ఎవరో తెలుసా? మన క్లాస్‌మానీటర్‌గా ఉండేది చూడు కరుణా అని అదేనే... మనం కోపం కొద్దీ దాని "మాన్... ఈటర్' అనేవాళ్లం. కానీ అది తన పేరు సార్థకమయ్యేలా తన కరుణని అందరి మీద ప్రసరింపజేస్తోంది"

"ఆఁ నిజమా. చాలా ఆశ్చర్యపోయింది జానకి. ఆమె మనసు ముమారు ముప్ఫైయేళ్ల ముందుకు పోయింది. ఇక ఆగలేకపోయింది.

"ఏమండీ! మనం ఇప్పుడే వెళ్లి ఆ సదనం చూద్దామండి" అంది జానకి ఉద్వేగంగా.

"ఏమంటావ్ నవీన్! వెడదమా అందరం కలిసి. లేదూ నువ్వు నిరుపమా ఇంటికి వెళ్లిపోండి. మేం ముగ్గురం తర్వాత వస్తాం" అన్నాడు రామారావ్.

నిరుపమ నవీన్‌వైపు చూసింది.

"నిరూ! ఇవాళ చాలా తిరిగాం. అలిసిపోయి ఉంటావ్. నీకు రెస్ట్ అవసరం. అంతగా అయితే మనం మరోసారి వెడదాం సరేనా!" అన్నాడు నవీన్.

"ఓహో! మా చిన్ని తల్లి కాబోతుందా? ఎన్నో నెల?" ఆనందంగా అడిగింది ఆరతి.

'మొన్ననే ఆరో నెల వచ్చింది. కానీ ఎంతో కడుపే ఎత్తుగా కన్పించటం లేదు" అంది జానకి.

"తొలిచూలుకదా అలాగే ఉంటుంది" అంది ఆరతి.

నవీన్ నిరుపమలు వారి వద్దనుండి సెలవు తీసుకుని ఇంటికి బయలుదేరారు. మిగిలిన వారంతా 'సాంత్వన సేవాసదనం' వైపు కదిలారు.

000

భోజనాలయ్యాక వంటిల్లు సర్దుకొని వచ్చేసరికి తనకోసమే ఎదురుచూస్తూ కూర్చున్న నవీన్‌ని చూస్తూనే నవ్వింది నిరుపమ.

"ఏంటి? ఇంకా నిద్రరావడం లేదా?"

"నువ్వు పక్కనే లేకుండా నిద్రెలా పడుతుంది?" అన్నాడు నిరుపమ వంక చూస్తూ.

"మరీ అంత యావ పనికిరాదండి" అంది నిరుపమ.

"ఛీ... అందుక్కాదు. ఎంటో నీ ఒళ్లు తగులుతూ ఉంటే అదో సుఖం" అన్నాడు నవీన్ ఆమెని దగ్గరగా పొదువుకుంటూ.

"అవునూ... నిరూ! మీ అమ్మగారికి గర్భస్రావమైన సంగతి నాకీ రెండేళ్లలో ఎప్పుడూ చెప్పలేదేంటి?" అన్నాడు నవీన్.

ఆ మాటలకు నిరుపమ కొంచెంసేపు ఏం మాట్లాడలేదు.

"ఏంటా మౌనం అంత చెప్పకూడనిదైతే వద్దులే" అన్నాడు నవీన్.

"ఆహా! అలా కాదు. మీ మనసులో మా అమ్మానాన్నల ఆదర్శదాంపత్యం పట్ల మంచి భావం ఉంది. అది అబద్ధమని ఐమీన్ ఇప్పుడు నిజంగా ఆదర్శదంపతులే అనుకోండి. మా చిన్నప్పుడు మేము వీళ్లకెందుకు పుట్టామా? అని ఏడ్చుకునేవాళ్లం. ఎప్పుడు చూసినా కొట్లాటలు, వాళ్లిద్దరూ అరుచుకోవటాలు, ఇంటికి రావాలంటే భయం వేసేది. స్కూల్లోనే ఉండాలన్పించేది. కుక్క - పిల్లి - ఎలుకల కన్నా అధ్వాన్నంగా ప్రవర్తించేవాళ్లు. వాళ్లిద్దరూ దెబ్బలాడుకొని ఆకోపం మామీద చూపించేవాళ్లు. అను చాలా చిన్నది. అర్థం చేసుకునే వయసు లేదు. నాకేమో అప్పుడప్పుడే ఊహ వస్తున్న వయసు.

"నీకూ అనుపమకి ఐదేళ్ల తేడా ఉందనుకుంటా గదూ' అన్నాడు నవీన్.


"అవును... ఆ తర్వాత ఐదేళ్లకి అమ్మ మళ్లీ ప్రెగ్నెంట్ అయింది. మళ్లీ ఆడపిల్ల పుడితే పెంచడం నావల్ల కాదని నాన్న, అమ్మని అబార్షన్ చేయించుకోమన్నాడు. అజాగ్రత్త, నిర్లక్ష్యం మనవైపుంచుకొని పుట్టబోయే శిశువుని చంపుకోవడం ఎందుకని అమ్మ వాదన. తన మాట అమ్మ వినడం లేదన్న కోపం కొద్దీ నాన్న తన తాగుడిని మరింత ఎక్కువ చేశాడు. రోజూ తాగిరావడం, అమ్మతో దెబ్బలాడటం, పశువులా మీదబడి" గొంతు జీరపోగా ఇక చెప్పలేక ఆగిపోయింది నిరుపమ.

ఆశ్చర్యంతో నోరు తెరిచాడు నవీన్.

"ఏంటీ! మామయ్యగారు... తాగేవాళ్లా... అత్తగార్ని కొట్టేవాళ్లా?" ఆశ్చర్యంతో అడిగాడు.

"అవును" కొంచెం సిగ్గుగా చెప్పింది నిరుపమ.

"ఒకసారి కూడా ఇలాగే... తాగి వచ్చి అన్నం తింటూ అన్నంలో రాయొచ్చిందని నిండుగా ఉన్న పళ్లాన్ని నేలకి విసిరికొట్టారుట. నాన్న ఇంటి ఖర్చులకు సరిగ్గా డబ్బులీయక పోవడంతో ఉద్యోగంలో చేరిన అమ్మ అతికష్టం మీద మాకు తిండిని అమరుస్తూ ఉండేది. అందుకే కోపంతో ఊగిపోతూ "ఛీ... పశువా" అని తిట్టింది. దాంతో నాన్న రెచ్చిపోయి అమ్మని ఎడాపెడా తన్నటం ఆమె వెళ్లి మంచం కోడుకి తగులుకొని పడిపోవడం కడుపుకి బలంగా దెబ్బలు తగలడంతో అబార్షన్ కావటం జరిగాయి. అమ్మకూడా బతుకుతుందన్న ఆశపోయింది. పోలీస్ కేస్ అయ్యేంతవరకూ విషయం వెళ్లింది. తన అజాగ్రత్తవల్లే ఇదంతా జరిగిందని అమ్మ చెప్పినప్పుడు అందరికీ కోపం వచ్చింది. కానీ అలా చెప్పడం వల్లనే నాన్నలో మార్పు వచ్చింది. ఒక్కసారిగా రక్తాన్ని చూసి బెదిరారో లేక చావబోతున్న అమ్మ తన మాటతో ప్రాణాలు రక్షించిందన్న కృతజ్ఞతో తెలీదు గానీ అప్పట్నుండీ ఆయన్లో పూర్తిగా మార్పు వచ్చింది. గర్భస్థ శిశువు 'మగపిల్లాడని' తెలిసి అంతా విలవిలలాడిపోయారు. నాన్నే నేను నా కొడుకుని పోగొట్టుకొన్నా నా కూతుళ్లని కొడుకుల్లాగే పెంచుకుంటానని అన్నాడు. అలాగే అతిగారాబంగా పెంచాడు. నాకు ఈ విషయలు ఇన్నియినా గుర్తున్నాయి గానీ అనుపమకేవీ



గుర్తులేదు. అందుకే నాన్నంటే అంత ప్రేమ దానికి. కానీ నాన్నకి నేనంటే ఇష్టంతో బాటు భయమూ ఉంది. నీకింకా నామీద కోపం ఉందా అని చాటుగా అడుగుతుంటారు' అంది నిరుపమ.

"సినిమా చూస్తున్నట్లుంది. ఇప్పటి వీళ్లు అప్పటి వాళ్లు ఒకరేనా" అని.

"ఆ... నాకూ అలాగే అనిపిస్తుంటుంది. అమ్మ దెబ్బలు తిన్నప్పుడల్లా ఆ గాయాలకు మందు రాస్తూ పోలీసులకి చెప్పేయ్ అమ్మ నాన్న పని పడతారు అనేదాన్ని. నాన్నతో మాట్లాడేదాన్ని కాదు. ఎందుకొచ్చిన సహనం అని తిట్టుకొనేదాన్ని. అమ్మ చూపించే ఓర్పు అర్థం లేని విషయంలా కన్పించేది. ఆఖరికి అమ్మ నమ్ముకున్న ఆ అమ్మవారే అమ్మని ఆ కష్టాలనుండి రక్షించింది.' అంది నిరుపమ.

"అందుకే కాబోలు అంటారు 'సబర్‌కా ఫల్ మీఠా హోతాహై" అని మనం ఓపిక పడితే తీయని ఫలాన్ని పొందుతామని దానర్థం."

"ఆహా! అమ్మ విషయంలో అది నిజం. నాన్న తాగుడు మొదలు పెట్టినప్పటి నుంచీ ఓపిక పట్టింది. తనని అనరాని మాటలన్నా విని భరించింది. అలాంటి మాటలంటున్న అతన్తో ఇంకా ఎందుకమ్మా మనం అమ్మమ్మా వాళ్లింటికి వెళ్లిపోదాం అని నేనేడ్చినా 'మీ నాన్నది కాదమ్మా ఆ నేరం ఆ ద్రవానిది అంతే' అనేది. నాకప్పట్లో అవన్నీ అర్థంకాక అమ్మ మీద కూడా కోపం తెచ్చుకునేదాన్ని. తను అన్ని కష్టాలు పడినందుకేమో మా ఇద్దరికి ఎలాంటి మొగుళ్లు వస్తారోనని భయపడేది. ఆ దేవీ దయవల్ల మీరు దొరికారు. అనుపమకీ మీలాంటి వాడొస్తే చాలనుకొంటోంది. అమ్మ నాన్నల మనసులకింత తృప్తినందించిన మీరంటే నాకు మరింత ప్రేమ" అంటూ అతని తల నిమిరి నుదుటి మీద ముద్దు పెట్టుకుంది నిరుపమ.

"జీవితంలో నేను ఏనాడూ ఏ వ్యసనానికీ చోటివ్వను. లేకుంటే ఆ వ్యసనాలు మనుషుల్ని కీలుబొమ్మల్ని చేసి ఆడిస్తాయి" అన్నాడు నవీన్.

"ఆడదాని మనసుని అర్థం చేసుకునే మగాడున్న ఇంట్లో సంతోషం వెల్లి విరుస్తుంటుంది" అంటుంది అమ్మ.

"నిజమే. ఆమాటని నేను ఎల్లవేళలా నిజం చేస్తాను ప్రియా" అన్నాడు నవీన్ నిరుపమను అల్లుకుపోతూ.

000

"కరుణా! ఎవరినో తీసుకొచ్చానో చూడు" అంది ఆరతి, జానకిని ఆమె ముందుకు నెడుతూ.

"ఏయ్! జానీ! నువ్వు... అబ్బా ఏమీ మారలేదు సుమా నువ్వు." అంటూ ఆనందంగా ఆమె చేయిని నొక్కింది కరుణ. ఓసారెప్పుడో చూసినప్పుడు పట్టుచీరలో హుందాగా, మెడనిండా నగలతో కన్పించిన కరుణ, తెల్లని సాదా చీరలో - అతి నిరాడంబరంగా ఉండటం జానకికి ఆశ్చర్యాన్ని కల్గించింది.

"వీరు మా వారు రామారావ్‌గారు" పరిచయం చేసింది భర్తని. ఆమె గురించి అన్ని వివరాలు తెలుసుకొన్న కరుణ, రామారావ్ వైపు తిరిగి, "మీలా భార్యను అర్థం చేసుకునే వాళ్లుంటే ఈ 'సాంత్వన' లో ఇంతమంది ఉండేవారు కాదు" అంది కరుణ. ఆ మాటలకు కాస్త గిల్టీగా ఫీలవ్వుతూ ఇబ్బందిగా నవ్వాడు రామారావ్.

ఇంతలో 'అమ్మా' అంటూ అక్కడికి వచ్చిన యువకుడు, వారందర్నీ ముఖ్యంగా అనుపమని చూస్తూనే ఆశ్చర్యపోయాడు.

"వీడు మా అబ్బాయి. తనకో అమ్మాయి నచ్చిందట. వివరాలు తెలీవట. కానీ ఆ అమ్మాయినే ఎలాగైనా వెదికి పెళ్లాడుతానంటూ మూడేళ్లుగా పెళ్లిని వాయిదా వేస్తున్నాడు. కోడలొచ్చే రాత నాకుందో లేదో" అంది కరుణ. అందుకా యువకుడు కంగారు పడుతూ, "అమ్మా ఓసారి ఇలారా!" అంటూ ఆమెని పక్కగదిలోకి తీసుకెళ్లి ఏదో మాట్లాడాడు.

నవ్వుతూ తిరిగి వచ్చి కరుణ, "జానీ! మా అబ్బాయి వెదికే ఆ అమ్మాయి మీ అమ్మాయే కావడం ఎంత యాధృచ్ఛికం చూడు. వీడు మా అబ్బాయి రవి. నా కొడుకని గొప్పకాదుకానీ స్త్రీపట్ల ఎంతో గౌరవం ఉన్నవాడు. ఈ సాంత్వన నిర్వహణంతా వాడిదే. నాకున్న ఆస్తిపాస్తులు వివరాలు ఆరతినడిగితే చెబ్తుంది. మీరు నిదానంగా ఆలోచించి ఏ విషయమూ చెప్పండి" అంది.

ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు జానకీ, రామారావ్‌లు. కొద్దిగా ఆలోచించి చెబుతానంది అనుపమ.

"ఏమ్మా. ఇక్కడి ఇందరి కథలు విని భయపడ్తున్నావ? పెళ్లంటే" అడిగింది కరుణ.

"ఒక విధంగా అంతే. మగాళ్లు ఇంత కర్కశంగా ఎలా మారతారో అర్థం కాదు" అంది అనుపమ.

"నా అనుభవం కొద్దీ చెబుతున్నాను. ఎందుకంటే ఇందరి కథలు విన్న దాన్ని కాబట్టి ఒక కాపురం చెడటానికి కారణం మగాడు అరవై శాతం కారణం ఆడది నలభై. చాలా రేర్‌గా కొన్ని కాపురాల్లో భర్తది ముప్పై శాతం ఉంటే భార్యదే డెబ్బై శాతం. నేను డబ్బున్నవారి పిల్లనవడంతో నా భర్తను చాలా నిర్లక్ష్యం చేశాను. ఆయన పోయాక గానీ ఆయన విలువ తెలిసి రాలేదు. నా కూతురు నాలాంటిదే అయితే ఎన్నోవిధాలుగా నచ్చజెప్పాను. ఇప్పుడు వారిద్దరు ఓ.కే. ఇప్పటి భార్యాభర్తల్లో అవగాహన అధికం అయింది. ఇద్దరం సమానమే అన్న భావమూ ఏర్పడుతోంది. అది లోపించిన వారి జీవితాలే విషాదాంతాలు అవుతున్నాయి. భర్త మూర్ఖుడైతే భార్య, భార్య మూర్ఖురాలైతే భర్త ఓపిక చూపాలి. చాలావరకు సహనము, రాజీ కాపురాలని నిలబెడుతున్నాయి" అంది కరుణ.

ఆ మాటలతో రిలాక్సయింది అనుపమ, "కానీ సహనానికీ ఓ హద్దు ఉంటుందిగా" అంది.

"అది తెలిసి మసలుకోవడంలోనేగా విజ్ఞత కన్పించేది" అంది ఆరతి. ఆమాటలు నిజమంటూ అందరూ అంగీకరించారు. ■

